

రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర విద్యా శాఖ, భారతీయ విజ్ఞానమండలి, సైన్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన కౌశల్ 25 సైన్స్ క్విజ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులను ఈనెల 27న తిరుపతిలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు అల్లూరి జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ పి. రమణమూర్తి నాయుడు జిల్లా సైన్స్ అధికారి కేజే రామారావు, తలారి సింగి పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి నాగేశ్వరరావు తెలిపారు. . జిల్లాస్థాయి విజేతకు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ స్వామి నాయుడు నగదు బహుమతి, మెమొంటోలను అందజేశారు.కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రింగ్ రోడ్డులో రాకపోకలకు ఇక్కట్లు

- ఏళ్ల తరబడి ఇదే దుస్థితి
- కనీస మరమ్మతులైనా చేపట్టని వైనం
- ప్రయాణానికి నిత్యం అగచాట్లు
- పవన్‌కల్యాణ్ హామీపైనే గిరిజనం ఆశలు



రాళ్లు తేలి రూపు కోల్పోయిన కివర్ల రోడ్డు

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని మారుమూల జీనబాడు, పినకోట, కివర్ల పంచాయతీలను ఆనుకొని ఉన్న 40 కిలోమీటర్ల పైగారింగ్ రోడ్డు దుస్థితి గోతులుమయమై ప్రయాణసంకటంగా మారింది. రోడ్డు పైభాగం పూర్తిగా ధ్వంసమై రాళ్లు బయటకు తేలిపోవడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర, ఇతర వాహనదారులతో ఇబ్బం1దులు పడుతున్నారు. తరచూ వాహనాలు మరమ్మతులకు గురై ప్రయాణం తడిసిమోపెడు అవుతోందని వాపోతున్నారు. ఇక అనారోగ్యం, ఇతర అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ కూడా రింగురోడ్డులో ప్రయాణానికి వీలులేనిపరిస్థితి ఉంది.ఇక వర్షాలు కురుస్తున్న సమయంలో రాళ్లతేలిన రోడ్డులో వాహనాలు స్కిడ్ అవడంతో పాటు గోతులుగా మారి మరింత ప్రమాదభరిత మౌతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందంటున్నారు. ఈ రోడ్డు మీదే రాకపోకలు సాగిస్తూ రైతులు, విద్యార్థులు, కూలీలు ఇబ్బందులు గురవుతున్నారు. రోడ్డు నిర్మించినప్పటి నుండి నేటి వరకు కనీసం నిర్వహణ, మరమ్మతులు లేకపోవడం వల్లే ఇలా అధ్వానస్థితికి చేరుకుందని స్థానికులు అంటున్నారు. దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు గతేడాది పెద్దకోట పంచాయతీలో పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మన్యంలోని రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని మాటిచ్చి ఏడాది గడుస్తున్నా ఇంకా కార్యాచరణలోకిఇ రావడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంపైనా, ఉపముఖ్యమంత్రి మాటపైనా ఎంతో నమ్మకం పెట్టుకున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి రింగ్ రోడ్డుకు తక్షణ మరమ్మతులతో రాకపోకల కష్టాలను తీర్చడంతోపాటు శాశ్వతప్రాతిపదికన పటిష్టం చేయాలని ఈ ప్రాంతీయులు వేడుకుంటున్నారు. . సంబంధిత అధికారులు రహదారి దుస్థితిని పరిశీలించి, ఇక్కడి ప్రజలు రాకపోకలకు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని మొరపెట్టుకుంటున్నారు.

గంజాయి నిర్మూలనకు అవిరళ కృషి

- పాడేరులో అవగాహన సైకిల్ ర్యాలీ
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి -పాడేరు: గంజాయి నిర్మూలనకు అల్లూరి జిల్లా యంత్రాంగం అవిశ్రాంత కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం గంజాయి నిర్మూలనపై అంబేద్కర్ జంక్షన్ నుండి ఐటిడిఎ జంక్షన్ వరకు నిర్వహించిన అవగాహన సైకిల్ ర్యాలీని జిల్లా ఎస్‌పి అమిత్‌బర్ధర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు, ఎస్‌పి అమిత్ బర్ధర్, పాడేరు డిఎస్‌పి షేక్ షామబాజ్, ఇతర అధికారులతో కలిసి సైకిల్‌ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక డిగ్రీ, జూనియర్ కాలేజీ, పాఠశాలల విద్యార్థులు 'నో డ్రగ్స్ నో టెన్షన్, ఇదే మీ సక్సెస్ మంత్రం', గంజాయి నుండి భవిష్యత్తును రక్షించుకొండి, బాల్యాన్ని బలి తీసుకుంటున్న డ్రగ్స్ మనకొద్దు' నినాదాలతో సైకిల్ ర్యాలీ సాగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 900 ఎకరాలకు పైబడి ఉన్న గంజాయి సాగును స్థానిక రైతులు, ప్రజల సహకారంతో రెండేళ్లుగా క్రమేణా నిర్మూలిస్తున్నామన్నారు. గంజాయి సాగు, వినియోగం నిర్మూలనకు గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. యువత, విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుబాఇరిన పడకుండా పోలీస్, ఎక్సైజ్, విద్యా, సంక్షేమశాఖల అధికారులతోపాటు లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో అనునిత్యం చైతన్యం కల్పిస్తున్నామన్నారు.

జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి ప్రజలు, యువత విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన కల్పించి దూరం చేసే చర్యలు చేపడుతున్నామన్నారు. అల్లూరి సరిహద్దుల్లోకి రాకుండా గంజాయిపై పటిష్టనిఘాకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ర్యాలీ అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర
- పలుచోట్ల యూనియన్ పతాకావిష్కరణలు



సిఐటియు జెండాకు సెల్యూట్ చేస్తున్న సురేంద్ర, తదితరులు

ప్రజాశక్తి- హుకుంపేట: సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు .మంగళవారం హుకుంపేట మండల కేంద్రంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి,, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వాలు కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి అమలుకు నోటిఫికేషన్ జారీ ద్వారా కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమను దోపిడీ చేసి వారిని కట్టుబానిసలుగా మార్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించడం దుర్మార్గమని మండిపడ్డారు. లేబర్ కోడ్స్ అమలుతో కార్మికులకు సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును హరించి యజమానులకు అనుకూలంగా చట్టాలు మార్పు చేశారన్నారు. కార్మిక హక్కులను కాపాడాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల సాధన కోసం, అలాగే బిజెపి, టిడిపి కూటమి కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వచ్చేనెల 4న విశాఖపట్నంలో బహిరంగ సభలో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, ఆశా యూనియన్, అసంఘటిత కార్మిక సంఘాల నాయకులు జి.ఆనంద్, కె.శంకర్ పాల్గొన్నారు.

పాడేరు: కార్మికులు ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు చట్టాలు కాపాడుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిఐటియు అఖిల భారత 18వ మహాసభ విజయవంతాన్ని కాంక్షిస్తూ యూనియన్ పతకాన్ని. పాడేరు జిల్లా కేంద్రంలో ముఠా, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సుందరరావు మాట్లాడుతూ, విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి ప్రారంభ మయ్యే అఖిలభారత మహాసభలో భాగంగా 4న కార్మిక ప్రదర్శన, ఆర్‌కె.బీచ్‌లో బహిరంగ సభ ఉంటుందని, అధికసంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో నరేంద్రమోడీ, రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం కలిగించే విధానాలు అవలంబిస్తున్నారని, వాటిని తిప్పికొట్టడమే లక్ష్యంగా మహాసభలో ఉద్యమకార్యాచరణ ఉంటుందన్నారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి. భాగ్యలక్ష్మి, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి. ముత్యాలమ్మ, కార్మికులు భూషణ్,చిట్టిబాబు పాల్గొన్నారు

విఆర్‌పురం: మండలంలోని గులేటివాడలో మంగళవారం సిఐటియు అఖిలభారత మహాసభలకు సంబంధించి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాజేశ్వరి, రైతు సంఘం నాయకులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ విశాఖ నగరంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను కార్మికవర్గం అంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన లేబర్‌కోడ్‌లపై కార్మికులు వ్యతిరేకతతో ఉన్నారన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని ఈ సందర్భంగా హెచ్చరిక చేశారు. కార్యక్రమానికి రైతు సంఘం నాయకులు కె. సత్తిబాబు, శాంతరాజు గిరిజన సంఘ నాయకులు గుట్టప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీకే వీధి: సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల నాయకులు గడుతూరి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జికె వీధి మండలం మంగళపాలెం గ్రామంలో మంగళవారం సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్ కోడ్‌లకు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. జనవరి 4న విశాఖ బీచ్‌లో లక్షలాది మంది కార్మికులతో జరిగే బహిరంగ సభకు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



పాడేరులో సిఐటియు పతాకావిష్కరణలో సుందరరావు, తదితరులు



విఆర్‌పురంలో కార్మిక జెండాకు వందనం చేస్తున్న కార్మికులు

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్



మాట్లాడుతున్న బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-ఎటపాక : అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎఎస్ఆర్ రంపచోడవరం సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. ఈ నెల 1న చింతూరులో జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. నక్కా సూరిబాబు అధ్యక్షతన రాంగోపాలపురంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు. 21 న చింతూరులో సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కాకా అర్జున్, సవలం రాము, బుద్దుల భద్రయ్య, గద్దల హుస్సేన్, తోట శ్రీను, పూసం బాబు, ముత్తులు పాల్గొన్నారు.

విఆర్‌పురం : ఈ నెల 21న చింతూరులో జరిగే అమరవీరుల సమస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. మంగళవారం గులేటివాడలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. చింతూరులో జరిగే బహిరంగ సభకు సిపిఎం అఖిలభారత నాయకులు, ఆంధ్ర, తెలంగాణ హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చిన్నబాబు, మండల కమిటీ సభ్యులు సత్యనారాయణ, ముఖ్య కార్యకర్తలు సున్నం గుట్టప్ప, సున్నం బుజ్జి, గోపాల్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సూరన్న గొంది గ్రామస్తులు పొడియం జానీ, పాండు దుర్గారావు పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల బాగుకోసం శ్రమించి అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి పాంద్రం తమ్మయ్య, పటేల్ పాంద్రం. రాజులు, పూజేరు పాంద్రుమ్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యకలాపాలతో ఉపాధ్యాయులపై ఒత్తిడి

యుటిఎఫ్ మండల అధ్యక్షుడు గాంధీరెడ్డి



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అడ్డతీగల: ఉపాధ్యాయులకు బోధనేతర కార్యాకలాపాలు అప్పగించడంతో వారిపై ఒత్తిడి ఎక్కువవుతోందని యుటిఎఫ్ మండల అధ్యక్షుడు గాంధీరెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో రాత్రి 7 గంటలకు నూతన కౌన్సిల్స్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల అనంతరం అధ్యక్షులు గాంధీరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సెలవు దినాల్లో పనిచేయాలని, ఒత్తిడి చేయడంతో పాటు బోధనేతర పనులు అప్పగిస్తున్నారని ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు.



అధ్యక్షుడు గాంధీరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవులు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ కౌన్సిల్స్‌లో గౌరవ అధ్యక్షులుగా కుశలన్న, అధ్యక్షులుగా గాంధీరెడ్డి , సహాధ్యక్షులుగా బాలరాజు, మహిళా సహాధ్యక్షురాలిగా రమణమ్మ, ప్రధాన కార్యదర్శిగా రాఘవులు, కోశాధికారిగా జగదీష్, ఎఫ్‌డబ్ల్యూఎస్ కార్యదర్శిగా కె.చిన్నారావు, పత్రికా కార్యద ర్శిగా కె.అబ్బాయిరెడ్డిని కార్యదర్శులుగా మురళీకృష్ణ, జి.పోలయ్య, వి.అప్పారావు, సత్యనారాయణ, లింగారెడ్డి, డెన్నిస్ను ఆడిట్ కమిటీ మెంబర్‌గా సిహెచ్. బాలరాజు, జిల్లా కౌన్సిలర్స్‌గా మంగరాజు, చిన్నిబాబు దొర, కమలారత్నం, రమణమ్మ, రాంబాబు నాగశిరీష రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



బాధితురాలికి నగదు అందిస్తున్న పాస్టర్ డానియెల్

కేన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-విఆర్‌పురం : మండలంలోని రామవరం పంచాయతీ రామవరం గ్రామానికి చెందిన బొగ్గబజారు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. మంగళవారం అగ్ని మినిస్ట్రీ ఆధ్వర్యంలో పాస్టర్ పి.డానియల్ పి.బుజ్జి పి.ఏలియాసు చేతుల మీదుగా బొగ్గ బజారుకు రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా డానియెల్ మాట్లాడుతూ ఆమె కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోందని, వారిది నీరు పేద కుటుంబమని వైద్యం చేయించుకునే స్థితి కూడా వాళ్లకు లేదని కూలి పని చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి వారికి సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మారేడుమిల్లి: అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలం పరిధిలోని దేవరపల్లి సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం రంపచోడవరం మండలం పెద్దగెద్దాడ పంచాయతీ చెరువుపాలెంనకు చెందిన చెదల లచ్చిరెడ్డి మరో వ్యక్తితో మారేడుమిల్లి నుంచి చెరువుపాలెం వెళ్తుండగా రాజమహేంద్రవరం నుంచి మారేడుమిల్లి బైక్‌పై వస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన యువకులు ఢీకొట్టారు. ప్రమాదంలో చెదల లచ్చిరెడ్డి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది లచ్చిరెడ్డికి ప్రథమ చికిత్స అందించి రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రజాసమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

ప్రజాశక్తి -సీలేరు: ప్రజాసమస్యలపై క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలన చేశామని టిడిపి క్లస్టర్ కో కన్వీనర్ చిటికెల రాము, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్.కె నాగూరు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ టిడిపి జిల్లా ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు ప్రజాసమస్యలపై ప్రత్యేకదృష్టి సారించామన్నారు. దుర్గావీధి, టీచర్స్ కాలనీ, అల్లూరివీధి సిపిహెచ్ కాంప్, గాజువాక లైన్‌లో విస్తృతంగా పర్యటించామన్నారు. డ్రైనేజీలు, వీధిలైట్లు, తాగునీటి సౌకర్యం సక్రమంగా ఉందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు బొర్రా కృష్ణ, కె.సన్యాసిరావు, గోవిందు కార్యకర్తలు పాల్గొన్నారు.



సీలేరు పిహెచ్‌సి వద్ద టిడిపి నాయకులు

'పిహెచ్‌సిలో మందుల కొరత లేదు'

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం సీలేరు పీహెచ్‌సిని సందర్శించి వైద్యాధికారి నారాయణరావుని మర్యాదపూర్వకంగా కలిశామని టిడిపి నాయకులు చిటికెల రాము, ఎస్కే నాగూరు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రోగులకు అందుతున్న వైద్యసేవలపై మందులు కొరత తదితర అంశాలపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నామన్నారు. అంబులెన్స్ కూడా అందుబాటులో ఉందని మందులు పూర్తి స్థాయిలో ఉన్నాయని వైద్యాధికారి తెలిపారన్నారు. ఆస్పత్రిలో ఇబ్బందులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వైద్యులకు తెలిపారు. కార్యక్రమంలో సన్యాసిరావు, బొర్రా కృష్ణ, కాశి గ్రామ కమిటీ సభ్యులు బూత్‌ఇన్‌చార్జిలు, పార్టీ కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించి, ప్యాకేజీ ఇవ్వాలి

- పోలవరం ప్రాజెక్టు అధికారి అభిషేక్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న ముల్లూరు గ్రామస్తులు

ప్రజాశక్తి-కూనవరం: తమకు పునరావసం కల్పించి, ప్యాకేజి ఇప్పించాలని మండలంలోని ముల్లూరు గ్రామస్తులు పోలవరం ప్రాజెక్ట్ అధికారి అభిషేక్‌ని కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు పరిధిలో ఉన్న ముల్లూరులో సుమారు 200 కుటుంబాలు ఉంటాయని, 2009లో ఒక ఎకరం భూమికి ఒక లక్ష 15 వేల రూపాయలు ఇచ్చారన్నారు. అప్పటినుండి ఇప్పటివరకూ ఆర్‌అండ్‌ఆర్ గానీ స్ట్రక్చర్ వాల్యూయేషన్ కానీ ఇవ్వలేదని వాపోయారు. వ్యవసాయానికి సంబంధించిన పంట నష్టం, వ్యవసాయ పనిముట్లు, బ్యాంకులోన్, ఎరువులు, విత్తనాలు ఏమీ రావడం లేదన్నారు. ఈ విషయమై అధికారులను అడగగా మీ పొలాలకి ప్యాకేజీ ఇచ్చారు కాబట్టి మీకు ప్రభుత్వం నుండి ఏమీ రాదు అని బదులిచ్చారన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ గ్రామాన్ని 41 కాంటూరులో కలిపి గ్రామానికి స్ట్రక్చర్ వాల్యుయేషన్, ఆర్‌అండ్‌ఆర్, 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పునరావాసం కల్పించి న్యాయం చేయాలన్నారు. పై అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చేస్తాను అని అభిషేక్ హామీ ఇచ్చారు.

మండలంలోని రేపాకలో పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి అభిషేక్‌ను పర్యటించారు. పెద్దఆర్కుర్ సర్పంచ్ నాగమణి, ఎంపిటిసి అమ్మాజీ రేపాక గ్రామస్తులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 41.5 కాంటూరులో కలిపి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. దానికి ఆయన స్పందించి న్యాయం జరిగే విధంగా చూస్తామని అన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం 330 మంది ఇంటర్ విద్యార్థులు ప్రిఫైనల్ పరీక్షలు రాస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని ఫస్ట్ ఇయర్ 186, సెకండ్ ఇయర్ 124 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, ఈ నెల 20వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

గిరిజన కాఫీ రైతుల ప్రోత్సాహక నిధులు మాయం!

- రైతుల ఖాతాల్లో జమ చేయడంలో అలసత్వం
- పాడేరు ఐటిడిఎ కాఫీ బోర్డు అధికారుల తీరుపై కాఫీ రైతు సంఘం ఆగ్రహం



మాట్లాడుతున్న కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు చిన్నబాబు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: గిరిజన కాఫీ రైతుల ప్రోత్సాహక నిధులు ఏమయ్యాయి, ఎవరి జేబుల్లోకి వెళ్లాయని కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు గెమ్మెలి చిన్నబాబు, జిల్లా నాయకులు కె లక్కు ప్రశ్నించారు. పాడేరు ఐటిడిఎ కాఫీ బోర్డు అధికారుల తీరుపె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతంలో పండుతున్న అరకు ఆర్గానిక్ కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గుర్తింపు ఉన్నప్పటికీ, ఆ కాఫీని పండిస్తున్న రైతులకు ప్రభుత్వం కాఫీ బోర్డు ద్వారా అందించాల్సిన ప్రోత్సాహక నిధులు నేటికీ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.2023లో కొత్తగా కాఫీ నాటిన10 వేల మంది రైతులు 10 వేల ఎకరాల్లో, 2024లో కన్సాలిడేషన్ కింద 12 వేల మంది రైతులు 12 వేల ఎకరాల్లో, 2025లో 8 వేల ఎకరాల్లో కన్సలిడేషన్ పనులు పూర్తి చేసినప్పటికీ, వాటికి సంబంధించిన ప్రోత్సాహక నిధులు ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. ఒక్కో ఎకరాకు రూ.9వేలు చొప్పున మూడేళ్లకు రైతులకు చెల్లించాల్సిన రూ.రెండు వేల కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. గతంలోనూ రైతులకు చెల్లించాల్సిన రూ.67 కోట్లు ప్రోత్సాహక బకాయిల చెల్లింపుపై ఐటిడిఎ వద్ద ఆందోళన చేసిన సమయంలో ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు ఆ మాటను నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం నుంచి .నిధులు విడుదలౌతున్నా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కావడం లేదని, ఈ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో లక్ష ఎకరాల్లో కాఫీ తోటల విస్తరణకు రూ.2,000 కోట్లు విడుదలైనట్లు పత్రికల్లో వార్తలొచ్చినా, రైతులకు మాత్రం ఒక్క రూపాయి కూడా అందలేదని తెలిపారు. మరోవైపు పాడేరు ఐటీడీఏ కాఫీ బోర్డులో 20ఏళ్లుగా పనిచేస్తున్న ఉన్నతాధికారులు బదిలీలు లేకుండా ఇక్కడే తిష్ట వేసి ఉన్నారని ఆరోపించారు.కాఫీ బోర్డులో గ్రామస్థాయిలో పనిచేస్తున్న 153 మంది సిఎల్‌డబ్ల్యు, 15 మంది ఎఫ్‌సి ఉద్యోగులు గిరిజన రైతులకు చీడపీడల నివారణలో కీలకంగా పనిచేస్తున్నప్పటికీ, వారికి కనీస వేతనం కూడా చెల్లించడం లేదన్నారు. సిఎల్‌డబ్ల్యు, ఎఫ్‌సి ఉద్యోగులను పర్మినెంట్ చేసి, వారికి ఉద్యోగభద్రత, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు విచ్చలవిడిగా కాఫీ కొనుగోలు అనుమతులు ఇవ్వడం వల్ల ఇతర ప్రాంతాల్లో పండిన కాఫీని 'అరకు కాఫీ' పేరుతో విదేశాల్లో అమ్ముతూ ఆర్గానిక్ బ్రాండ్‌కు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి అనుమతులను వెంటనే నిలిపివేయాలని అధికారులను కోరారు. విడుదలైన కాఫీ ప్రోత్సాహక నిధులను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లేనిపక్షంలో గిరిజన ప్రాంతంలోని కాఫీ రైతులందరితో కలిసి కాఫీ రైతు సంఘం ఆధ్వర్యంలో పాడేరు ఐటిడిఎ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాఫీ రైతు సంఘం నేతలు సిహెచ్ గురుమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని బైకిస్టుకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని పంతలచింత హైవే రోడ్డు మలుపు వద్ద మంగళవారం బైకును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హుకుంపేట మండలం రంగశీల పంచాయతీ ఇరుకువలస గ్రామానికి చెందిన కొర్రా మధు అనే గిరిజనుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్వగ్రామం నుంచి అరకు వైపు బైకులో మరో స్నేహితుడితో కలిసి వస్తుండగా పంతలచింత జాతీయ రహదారి మలుపులో గుర్తు తెలియని కారు బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో మధుకు తల, కాళ్ళు, ముఖంపై బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌లో అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య చికిత్సలు అందించిన వైద్య సిబ్బంది, ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.

21న తొలివిడత పల్స్‌పోలియో

శతశాతం చిన్నారులకు చుక్కలు వేయడమే లక్ష్యం
జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో ఈ నెల 21న ఆదివారం తొలివిడత పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.కృష్ణమూర్తి నాయక్ వెల్లడించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21, 22, 23, తేదీల్లో పల్స్ పోలియోను విజయవంతం చేసేందుకు పండగ వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, అతికించాలని అవగాహన కార్యాక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులను అవగాహన కలిపించి పోలియో చుక్కలు వేయించాలని అన్నారు.
అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అర్హులైన 0-5 సంవత్సరాల 1,29,959 మంది చిన్నారులను లక్ష్యంగా పోలియో చుక్కలను వేయనున్నట్లు తెలిపారు. 2,506 బూత్‌లను ఏర్పాటు చేసి 10,024 మంది వ్యాక్సినేటర్లు, 233 మంది పర్యవేక్షకుల ద్వారా 37 ట్రాన్సిట్ పాయింట్లు, 74 సంచార బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వలస కార్మిక ప్రాంతాలు, నిర్మాణ స్థలాలు, ఇటుక బట్టీలు వంటి 39 హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దీనికోసం 1.82 లక్షలకు పైగా డోసులు అందుబాటులో ఉంచామని,73 కోల్డ్ చైన్ యూనిట్లు సిద్ధం చేశామని వివరించారు. ఏదైనా కారణాల వల్ల ఆ రోజు పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి వంద శాతం పోలియో చుక్కలు లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు.

21న మారేడుమిల్లిలో యుటిఎఫ్ మహాసభ

ప్రజాశక్తి -అనంతగిరి : అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ మారేడుమిల్లి ప్రాంతంలో ఈనెల 21న నిర్వహించే యుటిఎఫ్ నాలుగో మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ అల్లూరి జిల్ల్ అధ్యక్షులు పుడిగి .దేముడు పిలుపునిచ్చారు. మంగళవారం శివలింగపురం బాలుర పాఠశాల వద్ద పాఠశాలల విరమణ అనంతరం మండల కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారేడుమిల్లి ప్రాంతంలో నిర్వహించే బహిరంగసభకు జిల్లాలోని అన్ని మండలాల నుండి సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జన్ని. దేముడు, సహాధ్యక్షులు ఎస్.గంగరాజు, కెవి .ఉషారాణి కోశాధికారి విజయ్ కుమార్, జిల్లా కౌన్సిలర్ సహాధ్యక్షులు శెట్టి. రాంబాబు, కార్యదర్శులు బిడ్డ. సింహాచలం, పి. నాగేశ్వరరావు, కె. ప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా నాయకులు

అనంతగిరి ఎంపిపి నీలవేణి తొలగింపు

ప్రజాశక్తి -అనంతగిరి : అవిశ్వాసతీర్మానంలో బలాన్ని నిరూపించుకోలేకపోయిన స్థానిక ఎంపిపి శెట్టి నీలవేణిని పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపిపి నీలవేణి తీరును నిరసిస్తూ పలువుర ఎంపిటిసిలు సబ్ కలెక్టర్‌కు సెప్టెంబర్‌లో అవిశ్వాస తీర్మానంపై లిఖితపూర్వకంగా విన్నవించగా, సబ్ కలెక్టర్ ఆదేశాలతో అక్టోబర్ 30న అవిశ్వాస తీర్మానంపై బలనిరూపణకు ప్రీసైడింగ్ అధికారి ఆర్‌డిఒ. లోకేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక మంల సమావేశం నిర్వహించారు. ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో మండలంలోని 14 మంది ఎంపిటిసిలకు గాను, 11 మంది సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తి ఆమొదం తెలిపారు. మెజార్టీ ఎంపిటిసిలు అవిశ్వాసానికి ఆమోదం తెలపడంతో తదుపరి చర్యలకు ప్రభుత్వానికి సిఫార్స్ చేశారు. దీనిపై రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్పందిస్తూ పరిశీలించిన అనంతరం ఎంపిపిని పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

హర్షం వ్యక్తం చేస్తున్న సభ్యులు

తమను ప్రశ్నించేవారు లేరన్న ధోరణిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎంపిటిసిలకు తగిన ప్రాధాన్యత, గుర్తింపు ఇవ్వకుండా పాలన సాగిస్తున్న ఎంపిపి నీలవేణి తీరుకు ఇది చెంపపెట్టు అని అవిశ్వాసం పెట్టిన టిడిపి, వైసిపి సభ్యులు అంటున్నారు. ఎంపిపిని పదవి నుంచి తొలగించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని గుమ్మ, పెద్ద బిడ్డ, లుంగపర్తి, వాలసి, పైనంపాడు, కివర్ల. వేంగడ పంచాయతీల పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనంతగిరి ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గిరిజన పిల్లలకు విద్యా సామగ్రి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని గన్నెల పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన వే మేకర్స్ ఫౌండేషన్ చైర్మన్ యేసుదాసు సహకారంతో .తడబారికి అప్పలస్వామి, శామ్యూల్ ఆధ్వర్యంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 119 మంది గిరిజన పిల్లలకు నోటుపుస్తకాలు, స్టేషనరీ కిట్‌లను పంపిణీ చేశారు. గ్రామంలోని వితంతు మహిళలకు చీరలు అందజేశారు.

మ్యుటేషన్, రీ సర్వే పూర్తి చేయాలి

అధికారులతో సమీక్షలో ఇన్‌ఛార్జి జెసి తిరుమణి శ్రీపూజ


మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీపూజ

ప్రజాశక్తి- పాడేరు: జిల్లాలో రెవిన్యూ రీ సర్వే, మ్యుటేషన్, ప్రక్రియలో అలసత్వం లేకుండా చూడాలని, మళ్లీ గ్రామసభలు నాటికి రీ సర్వే పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్‌కలెక్టర్లు, ఆర్‌డిఒలు, అన్ని మండలాల తహశీల్దార్లు, మండల, గ్రామ సర్వే అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో రెవెన్యూ సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రీ సర్వే చేసినప్పుడు ప్రభుత్వ, డీపట్టా భూములను పూర్తిగా పరిశీలించి వెబ్ ల్యాండ్ సబ్ డివిజన్ చేయాలని, ఎవరి భూమైతే వారి పేరును మాత్రమే సర్వేలో నమోదు చేయాలని ఆదేశించారు. భూవివరాల నమోదు తారుమారైనట్లు ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా చూడాలని ఆదేశించారు. పట్టా చేసేటప్పుడు 1,2 సార్లు పరిశీలించి తర్వాత మాత్రమే నమోదు చేయాలన్నారు. ప్రతి రెవెన్యూ రికార్డు వెబ్‌ల్యాండ్ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధికి సంబంధిత పత్రాలు లబ్దిదారులకు అందజేయడంలో ఆలస్యం చేయరాదని, బి అండ్ ఎస్‌ఎల్‌ఏ లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.
పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులపై సరైన వివరణలేకుండా దరఖాస్తులు తిప్పిపంపరాదన్నారు. ఎస్‌ఎల్‌ఏ గడువు దాటకుండా సంబంధిత అర్జీల పరిష్కారంపై తహశీల్దార్లు శ్రద్ధ చూపాలన్నారు. పిజిఆర్‌ఎస్ అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని ఆదేశించారు.
రీసర్వే ప్రక్రియలో గ్రామం యొక్క సరిహద్దులలో ఉన్న సమస్యలను బట్టి భూహక్కుదారు, యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. అటవీ, రెవెన్యూ సమస్యలున్న గ్రామాలలో సంబంధిత ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి, తహశీల్దార్ లేదా విఆర్‌ఒ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలుంటే కలెక్టరేట్ ఇడిఎమ్‌కు ఫిర్యాదు చెయ్యాలన్నారు.. భూసర్వేల సందర్భంగా భూయజమానులు, లబ్ధిదారుల నుంచి ముడుపులు వసూలు ఆరోపణలొస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఆఫీస్ ద్వారా డాక్యుమెంట్ అప్‌లోడ్, డిజిటల్ ప్రక్రియను వేగవంతం చేసి దరఖాస్తులను పరిష్కరించాలని ఆర్‌డిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు.
ఓటర్ల జాబితా మ్యాపింగ్‌లో బిఎల్‌ఒలు, సూపర్వైజరు అలసత్వం వహిస్తే తగిన చర్యలు ఉంటాయని అన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఆరోపణలకు తావులేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నాలా కలెక్షన్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇంకా కొన్ని మండలాల్లో నాలా వసూళ్లపై దృష్టి పెట్టలేదని, గడువులోగా శతశాతం వసూళ్లపను పూర్తి చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు.కార్యక్రమంలో రంపచోడవరం,చింతూరు సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, డిఆర్‌ఒ అంబేద్కర్, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ, ఎస్‌డిసి ఎంవిఎస్ లోకేశ్వరరావు, సర్వే ఏడీ కె.దేవేంద్రుడు, జిల్లా పౌర సరఫరాల అధికారి పాల్గొన్నారు.


వన్‌ధన్ వికాస్ కేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగులమ్మ

వన్‌ధన్ వికాస్ కేంద్రంతో ఉపాధి

ప్రజాశక్తి- జికెవీధి : వన్‌ధన్ వికాస కేంద్రంతో గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి దొరుకుతోందని టిడిపి మండల మాజీ జనరల్ సెక్రటరీ మామిడి నాగేంద్ర అన్నారు. మండలంలో సంకాడ పంచాయతీ నిమ్మలపాలెంలో వన్-దన్ వికాస్ కేంద్రం (హబ్ బిల్డింగ్) ప్రారంభోత్సవం వెలుగు సిసి సన్యాసమ్మ సర్పంచ్ నాగులమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాగేంద్ర మాట్లాడుతూ దీని ద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధితో పాటు చేతివృత్తిపనులకు ఉపయోగపడుతుం దన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సభ్యులు గ్రామపెద్దలు, ఎపిఒ ఆనంద్, సిపి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయఅవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

బాల్య వివాహాలపై న్యాయ అవగాహన

ప్రజాశక్తి-దేవీపట్నం: గౌరవ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ కాకినాడ, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రంపచోడవరం ఆదేశాల మేరకు ఇందుకూరు పంచాయతీ పరిధిలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో న్యాయఅవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలు గురించి డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ, రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు పరిధి అధికారులు అవగాహన కల్పించారు. పారా లీగల్ వాలంటీర్స్, కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు, తెల్లంశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై సదస్సు


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని కింద్రకాలనీలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కింద్ర కాలనీలో జి.నాగరాజు అనే రైతు ప్రకృతి వ్యవసాయంలో సమీకృత వ్యవసాయ విధానం, ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యక్షంగా చూపించి వివరించారు. అల్లూరి జిల్లా డిపిఎం భాస్కర్, టిఎల్‌ఎంపి శ్రీనివాసు, పికొండ, ఎన్‌ఎఫ్‌ఎ గంగరాజు, బాలరాజు, తదితరులు మాట్లాడుతూ సిబ్బందికి కూరగాయలు మిశ్రమపద్ధతిలో సాగు, చేపల పెంపకం ప్రకతి వ్యవసాయ విధానాన్ని గురించి తెలిపారు.

సమగ్రశిక్ష క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ఐఇ కో-ఆర్డినేటర్ కొమ్మ భాస్కరరావు

ప్రజాశక్తి-కూనవరం: అంగవైకల్య సమస్యను ఎదుర్కొంటున్న విద్యార్థులు, చిన్నారులు సమగ్ర శిక్ష క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని ఐఇ కోఆర్డినేటర్ కొమ్మ భాస్కరరావు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్ పాఠశాలలో సమగ్ర శిక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలీన మండలాల్లోని అంగవైకల్యంతో బాధపడుతూ, సదరం సర్టిఫికెట్ పొంది ఉన్న వారికి సహాయ పరికరాలు అందించేందుకు క్యాంపు నిర్వహించామని తెలిపారు. అన్ని అర్హతలు ఉన్నవారికి సహాయ పరికరాలు ఇస్తామన్నారు. ఎఎల్ఐ ఎంసిఒ (ఆర్టిఫిషియల్ లిమ్స్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్ర ప్రభుత్వ సహాయంతో వికలాంగులకు సహాయ పరికరాలను అందించడం జరుగుతోందన్నారు. నాలుగు మండలాల నుండి సమగ్ర శిక్ష క్యాంపుకు 50 మంది వికలాంగులు హాజరయ్యారని తెలిపారు. ఏఎల్ఐఎంసిఒ ప్రొఫెషనల్ ప్రియా, రితిక్ తివారి, ఆర్.శ్యాంసుందర్‌బాబు, నాలుగు మండలాల ఐఇ రిసోర్స్ టీచర్స్,స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్, నాలుగు మండలాల ఆయాలు, వికలాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు



క్యాంపు నిర్వహిస్తున్న ఐఇ కో ఆర్డినేటర్ కొమ్మ భాస్కరరావు

ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్‌గా రామ్మోహన్‌రావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ ఐటిఐ నూతన ప్రిన్సిపాల్‌గా వై.రామ్మోహన్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు డీఎల్‌టీసీ శ్రీకాకుళంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన్ను, పదోన్నతిపై చింతపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్‌గా నియామించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతానికి పదోన్నతిపై రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఇక్కడి వాతావరణానికి త్వరగా అలవాటు పడి సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఐటీఐ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ శిక్షణ అధికారి రమణ, సూపరింటెండెంట్ నానిబాబు, సిబ్బంది రాంప్రసాద్, విద్యాసాగర్, ఆనంద్, దొర, లక్ష్మి, సతీష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.


వై.రామ్మోహన్‌రావు

పినకోటలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కాశీపట్నం: గిరిజన ప్రాంతంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మళ్ల అనూష అన్నారు.మంగళవారం పినకోట పంచాయతీ కేంద్రంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర ఆధ్వర్యంలో ముందుస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. గ్రామానికి వచ్చిన అనూషకు పినకోట గిరిజనులు ఘనస్వాగతం పలికారు. అనూష కేక్ కట్ చేసి పంపిణీ చేసి అనంతరం 100 మంది చిన్నారులు100 మంది మహిళలు150 మంది పురుషులకు దుస్తులు పంపిణీ చేశారు. సహపంక్తి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. ట్రస్ట్ ప్రతినిధి ప్రసాదు, పాస్టర్లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మళ్ల అనూష

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ గుగ్గుడు గ్రామంలో మంగళవారం ఆదివాసి గిరిజన సంఘం, ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రక్తహీనత, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, కంటి సమస్యలు, చర్మ వ్యాధులు తదితర అనారోగ్యాలతో బాధపడుతున్న గిరిజన ప్రాంత ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు..శిబిరంలో ఉచిత డాక్టర్ కన్సల్టెన్సీ, ఇసిజి, బిసి పరీక్షల నిర్వహించారు.కార్యక్రమంలో ప్రజా వైద్యశాల డాక్టర్ కామేశ్వరరావు, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ భాగ్య రాజు, జనరల్ మెడిసిన్ డాక్టర్ రిషి, మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ వి.కిరణ్ కుమార్, పుష్పగిరి ఐ హాస్పిటల్ డాక్టర్ రాజు, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు బురిడీ దశరథ్, మండల నాయకులు కిండంగి రామారావు, పి.భీష్మ, పి.జయరాం పాల్గొన్నారు.

డోకులూరు మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన..

పాడేరు: ఆదివాసి గిరిజన సంఘం, ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో మండలంలోని డోకులూరు పంచాయతీ డేగలవీధి గ్రామంలో మంగళవారం విశాఖపట్నం మెడికవర్ ఆసుపత్రి, పుష్పగిరి శ్రీ వెంకటేశ్వర కంటి ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరాలను నిర్వహించారు. శిబిరంలో 90 మందికి బిపి. షుగర్, ఇసిజి వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న 10 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపికచేసి పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. ఏడుగురికి రూ.700 తక్కువ ధరకే కళ్ళద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్. ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సోమేలి చిట్టిబాబు.. మండల అధ్యక్షులు కె.సత్యనారాయణ. జిల్లా కమిటీ నాయకులు వి.దాసు .మండల నాయకులు డిబొజ్జన్న. స్థానిక సర్పంచ్ కె.సన్నిబాబు .పీసా కమిటీ కార్యదర్శులు ఎస్ కామేశ్వరరావు, మత్స్య లింగం, వార్డు సభ్యుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.



అరకురూరల్ : వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


పాడేరులో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

మొరాయిస్తున్న బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం గాలికొండ పంచాయతీ సప్పర్ల చట్రాపల్లి, కొత్తూరు గ్రామాలకు బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్ అందకపోవడంతో ఆరు నెలలగా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మాజీ జిల్లా కార్యదర్శి మొక్కల మహేష్ మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, మారుమూల గిరిజన గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ సెల్ సేవలు అస్తవ్యస్తంగా ఉన్నాయని దీంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచాలతో సంబంధాలు తెగిపోయాయని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సెల్ సేవలు వినియోగంలో తెచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు భీమన్న, కొర్ర బలరాం పూజారి లక్ష్మణ్, కొర్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి పోతురాజు, ఎంపిపి అనూషాదేవి

సిసి రోడ్డు, డ్రైయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి పంచాయతీ పరిధి సాడిపేట వీధిలో ఎంపీపీ, జెడ్పీటీసీ నిధులతో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ పోతురాజు, ఎంపీపీ కోరాబు అనూషాదేవి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ డ్రెయిన్ నిర్మాణానికి జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.3 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. తమ హయాంలో చింతపల్లి పంచాయతీలో తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు లక్షలాది రూపాయలు వెచ్చించినట్లు చెప్పారు. ఎంపీ నిధులు రూ.40 లక్షలతో చింతపల్లిలో కళ్యాణ మండపం నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, గుత్తేదారు పవన్ సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారి ప్రమీల తదితరులు

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-పెదబయలు : జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారి ప్రమీల మాట్లాడుతూ బాలలు డ్రాపౌట్స్ కాకుండా ఉన్నత చదువులు చదవాలని సూచించారు. 18 ఏళ్ళ లోపు టీనేజీలో మనస్సు,. శరీరం ఉరకలు వేస్తుందని, ఈ సమయంలో మనస్సు, శరీరాన్ని అదుపులో పెట్టుకొని చదువులు కొనసాగించి ఉపాధి అకాశాలు పొందాలని కోరారు. 18 ఏళ్ల నిండిన తరువాత మాత్రమే వివాహం చేసుకోవాలని సూచించారు. అవగాహన లేని వయసులో వివాహాలు చేసుకొంటే అనార్థాలకు గురవుతారని పేర్కొన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శంకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.